# సాక్షి పల్నాడు

గురువారం ၊ 25 ၊ జూలై ၊ 2024




**ఎస్పీకి హిందూ చైతన్య వేదిక వినతి**

నగరంపాలెం(గుంటూరు): వేంకటేశ్వరస్వామి సుప్రభాతాన్ని కించపరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు ఎస్పీ సతీష్‌కుమార్‌కు బుధవారం విన్నవించారు.



**సాగర్ నీటిమట్టం**

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం బుధవారం 503.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,882, ఎడమ కాలువకు 2,765 క్యూసెక్కులు విడుదలవుతోంది.



**సాగునీటి సమాచారం**

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2304, కొమ్మమూరు కాల్వకు 786 క్యూసెక్కులు వదిలారు.

## న్యూస్‌రీల్

### టౌన్ ప్లానింగ్ ఏసీపీగా అంజనా జేమ్స్



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా అంజనా జేమ్స్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏసీపీగా పనిచేసిన వెంకటేశ్వర్లు బదిలీ కాగా ఆయన స్థానంలో అంజనా జేమ్స్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రణాళికా విభాగం అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. అనధికార కట్టడాల నిర్మూలనతోపాటు కార్పొరేషన్ ఆదాయం పెంచి నగరాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

### పోస్టాఫీసుల ద్వారా మెరుగైన సేవలు

మంగళగిరి: పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు విజయవాడ రీజినల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసమూర్తి చెప్పారు. పోస్టల్ సేవలు గడపగడపకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ర్యాలీని బుధవారం ఆయన పట్టణంలో ప్రారంభించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పోస్టాఫీసుల ద్వారా పాస్‌పోర్టు, ఆధార్, రైల్వే బుకింగ్, కరెంట్ బిల్లుల చెల్లింపులు తదితర సేవలు అందిస్తున్నట్టు వివరించారు. మహిళలకు ప్రత్యేకంగా సేవింగ్స్ ఖాతాలు, బాలికలకు సుకన్య సేవింగ్స్ ఖాతాలతో అధిక ఆదాయం పొందవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రాధాకృష్ణమూర్తి, పోస్టుమాస్టర్ ఎం.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామాలలోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన (కారు, జీపు) డ్రైవర్లకు ఆర్టీసీ తరఫున హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు 2 డిపో మేనేజర్ ఎస్‌కె అబ్దుల్ సలాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 15 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. 16వ బ్యాచ్ కోసం అడ్మిషన్లు ప్రారంభించామని వివరించారు. ఒక బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 88973 71003, 73828 94585 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### యార్డుకు 48,776 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 48,776 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,150 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,160 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### విఘ్నేశ్వరునికి విశేష పూజలు



తెనాలి: ఆషాఢ మాసం బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా వివిధ దేవాలయాల్లో శ్రీ విఘ్నేశ్వరుడుకి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాజీరావుపేటలోని సిద్ధి విఘ్నేశ్వర మందిరంలో అర్చకుడు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అలంకరణ, అభిషేకం, పూజలు చేశారు. అలాగే మారీసుపేటలోని కోదండరామ స్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి) లోనూ విశేష పూజలు జరిగాయి. మనం నిత్య జీవితంలో ఏ కార్యం మొదలు పెట్టినా ముందుగా గణపతికి పూజ చేస్తామని, ఆషాఢ మాసం బుధవారం విశేషమైన రోజని ఆలయ ధర్మకర్తల్లో ఒకరైన లంకా శివానంద్ అన్నారు. స్వామివారిని దర్శించి ఆశీస్సులు పొందటం శుభసూచకం అని పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్తలు కూనపల్లి నారాయణ స్వామి, లంక శివానందకుమార్, లంక శివాంజనేయ ప్రసాద్, అర్చకులు ధనమని ధనుష్సుబ్రహ్మణ్య శర్మ, భక్తులు పాల్గొన్నారు .

# అమాయకులపై ఆంక్షల సంకెళ్లు

- భయం గుప్పెట్లో 75త్యాళ్లూరు వాసులు
- దాడికి కారకులపై పోలీసుల చర్యలు శూన్యం
- బాధితుడైన సాంబిరెడ్డి ఊరిలో మాత్రం పహారా
- ఇంటి నుంచి బయటకు రాకుండా హెచ్చరికలు జారీ
- ఇదేం ప్రజాస్వామ్యమంటూ గ్రామస్తుల ఆవేదన
- గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల శాంతియుత నిరసన



గాంధీ బొమ్మ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పెదకూరపాడు: దాడి చేసిన వారిని పట్టుకోకుండా... దాడికి గురైన వైఎస్సార్ సీపీ నేత ఈదా సాంబిరెడ్డి స్వగ్రామంలో పోలీసులు మంగళవారం రాత్రి నుంచి అడుగడుగున ఆంక్షలు పెట్టారు. స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో 75త్యాళ్లూరు గ్రామ వాసులు భయం గుప్పెట్లో ఉన్నారు. మంగళవారం సాయంత్రం క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ, 75 త్యాళ్లూరు మాజీ సర్పంచ్ ఈదా సాంబిరెడ్డిపై అమరావతి మండలం ఉంగుటూరు గ్రామం వద్ద కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాపు కాసి కర్రలు, రాడ్లులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీంతో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం 75త్యాళ్లూరులో దాడికి నిరసనగా కాలచక్ర రహదారి పక్కన ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ధర్నాకు పిలుపు నిచ్చారు. దీంతో పల్నాడు జిల్లా అడిషన్ ఎస్పీ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు 75త్యాళ్లూరు గ్రామానికి చేరుకున్నాయి. ప్రశాంతతకు నిలయమైన ఊరు ఒక్కసారిగా గ్రామ పెద్దపై దాడి జరగడంతో ఉలిక్కిపడింది. గ్రామంలోనికి పోలీసులు ఎన్నడూ లేని విధంగా పెద్దసంఖ్యలో రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు గ్రామానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంపుతున్నారు. దీంతో ఇదేం ప్రజాస్వామ్యమని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇంటి నుంచి బయటకు కూడా రాకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు



లేమల్లె వద్ద మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కారును అడ్డుకుంటున్న పోలీసులు

### దాడులను అందరూ ఖండించాలి



సమాజంలో ఇలాంటి దాడులను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలి. పోలీసులు నిరసన తెలిపేందుకు కూడా అనుమతులు ఇవ్వకపోవడం బాధాకరం. దాడిలో గాయపడిన వ్యక్తి ఊరిలోనే ఇంత పెద్ద ఎత్తున పోలీసులు ఉండటమేంటి? సాంబిరెడ్డిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి. పల్నాడు జిల్లా ఎస్పీని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందిస్తాం. పోలీసులు గ్రామంలో ఆంక్షలు ఎత్తివేయాలి.

– గుత్తికొండ అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత

### మాపైనే దాడి చేసి.. పైగా ఆంక్షలా..?



మా నాయకుడిని విచక్షణరహితంగా కొట్టారు. క్రూరంగా దాడి చేశారు. పైగా మా గ్రామంలో పోలీసులు భయంకరమైన వాతావరణం సృష్టిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దారుణం ఎక్కడా చూడలేదు. దాడికి పాల్పడిన వారిని పట్టుకోకుండా మా గ్రామానికి పెద్ద ఎత్తున రావడం శోచనీయం. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు రక్షణ లేదు.

– అల్లం భవాని, ఎంపీటీసీ, 75త్యాళ్లూరు

### ప్రశాంతతకు నిలయం మా గ్రామం



ఎలాంటి రాజకీయ కక్షలకు మా గ్రామంలో తావు లేదు. ప్రశాంతంగా ఉంటుంది. ఇలాంటి గ్రామంలో మా నాయకుడిపై విచక్షణరహితంగా దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి. బయటకు రాకుండా పోలీసులు పెద్ద ఎత్తున గ్రామంలో ఆంక్షలు పెట్టడం దారుణం. సాంబిరెడ్డి వివాదరహితుడు.

–దొండేటి సుజాత, 75త్యాళ్లూరు

### నిరసన కూడా తెలుపకూడదా?



సాంబిరెడ్డిపై దాడి చేస్తే శాంతియుతంగా నిరసన కూడా తెలుపకూడదా? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా...? వేరే దేశంలో ఉన్నామా..? వినతిపత్రం కూడా ఇచ్చే హక్కు మాకు లేదా...? ఇలాంటి దాడులు ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలి. మహిళలని కూడా చూడకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణం.

–గుత్తికొండ అనూరాధ, 75త్యాళ్లూరు

## పారిశుద్ధ్య ప్రణాళిక అమలుకు కమిటీలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశం



నరసరావుపేట: జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం మండల, మున్సిపల్ స్థాయిల్లో పారిశుద్ధ్య కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీ గ్రామ స్థాయిలో ప్రణాళిక అమలు చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, తాగునీరు, ఆధార్ కేంద్రాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణ కోసం జిల్లా, మున్సిపల్ స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పారిశుద్ధ్యం, ఆరోగ్య నిర్వహణపై మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. వైద్యాధికారులను సంప్రదించి పరిస్థితులను పర్యవేక్షించాలని తెలిపారు. డ్రైడేను శుక్ర, శని, ఆదివారాలలో నిర్వహించాలని పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి స్వచ్ఛత పెంచాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 71 ఆధార్ కేంద్రాల్లో వీలైనంత ఎక్కువ మందికి ఎన్‌రోల్‌మెంట్ సర్వీసులు అందించాలని సూచించారు. వచ్చే నెలలో తొలి రోజే వందశాతం పింఛన్ల పంపిణీకి వీలుగా ముందురోజే బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవడం, ఒక్కో ఉద్యోగికి 50 నుంచి 60 మంది పింఛన్‌దారులను మాత్రమే మ్యాపింగ్ చేయడం, దూర ప్రాంతాల్లో లబ్ధిదారులను ముందురోజు నాటికే సొంత ఊళ్లకు వచ్చేలా చూడటం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ సీఈవో వసంతరాయుడు, డీపీవో ఎం.వి. భాస్కర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, గ్రామ–వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, డీఎల్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ సీనియర్ల దాష్టీకం

- పరీక్ష పేరుతో జూనియర్లను చితకబాదిన వైనం
- నరసరావుపేట ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల హాస్టల్లో అర్ధరాత్రి పైశాచికం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన.. ఏటా ఇదే తంతు
- కేసు నమోదు చేసిన నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు



జూనియర్‌ను చితకబాదుతున్న సీనియర్లు

సాక్షి, నరసరావుపేట: క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన ఎన్‌సీసీ సీనియర్ క్యాడెట్స్ పైశాచిక ఆనందంతో జూనియర్లను చితకబాదారు. సర్టిఫికెట్ కోసం ఉబికి వస్తున్న కన్నీటిని దిగమింగుకుని జూనియర్ క్యాడెట్స్ బాధను ఓర్చుకున్నారు. ఈ వీడియో ఆలస్యంగా బయటకు రావటంతో ఒక్కసారిగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థిలోకం ఉలిక్కిపడింది. విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగాయి. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

**ఏటా ఇదే తంతు...**

వజ్రోత్సవాలు జరుపుకోబోతున్న పల్నాడు జిల్లా నరసరావుపేటలోని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ(ఎస్ఎస్ అండ్ ఎన్) కళాశాల స్థాయిలో ఎన్‌సీసీ విభాగం ఉంది. ఇక్కడ ఏటా సీనియర్ విద్యార్థులు జూనియర్లపై వికృతచేష్టలకు పాల్పడడం సర్వసాధారణంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఏటా బీ సర్టిఫికెట్ పరీక్షకు వెళ్లే క్యాడెట్స్‌ను సీనియర్లు విచక్షణరహితంగా వెదురు బెత్తాలతో కొట్టడం ఇక్కడ ఆనవాయితీగా మారిందని సమాచారం. సీనియర్లు కొట్టే దెబ్బలకు చర్మం లేచిపోయి భరించలేని నొప్పితో ఎంతో మంది జూనియర్లు నరకయాతన అనుభవించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన వీడియోలోనూ జూనియర్లను సీనియర్లు చితకబాదిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

**గత ఫిబ్రవరిలో ఘటన**

గత ఫిబ్రవరి 3,4వ తేదీలలో చీరాలలో బీ–సర్టిఫికెట్ పరీక్షకు వెళ్లే 20 మంది క్యాడెట్లను సీనియర్లు 2వ తేదీ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు చితక్కొట్టారు. ఆ వీడియో ఇప్పుడు బయటకు వచ్చింది. తమ సీనియర్లు ఇంత కంటే ఎక్కువగా కొట్టారని వీడియోలో కొడుతున్న వారే కామెంట్ చేయటం ఈ తంతు కొన్నేళ్లుగా కొనసాగుతోందని చెప్పడానికి నిదర్శనంగా ఉంది. క్యాడెట్ల పరేడ్‌ను పర్యవేక్షించాల్సిన ఎన్‌సీసీ ఆఫీసర్ డ్రిల్ సమయంలో ఉండరని విద్యార్థులు బుధవారం చెప్పారు. డ్రిల్ ఉన్న రోజు సాయంత్రం ఆలస్యంగా వచ్చేవారిని క్రమశిక్షణ పేరుతో చిత్రహింసలు పెడతారంటున్నారు.

**నోరువిప్పని యాజమాన్యం**

ఘటనపై కళాశాల యాజమాన్యం నోరు విప్పడం లేదు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కే రాజు, దెబ్బలు తిన్న విద్యార్థులను తన చాంబర్‌కు పిలిపించుకొని విచారణ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని చుట్టుముట్టడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య ఘటనపై విచారణ జరుపుతున్నామని మొక్కుబడిగా ప్రకటించారు.

### ఏఐఎస్ఎఫ్ ధర్నా..


ఎన్‌సీసీ జూనియర్ క్యాడెట్లపై సీనియర్ల దాష్టీకాన్ని నిరసిస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట, హాస్టల్ వద్ద ధర్నా నిర్వహించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఎం.నాగేశ్వరరావు, గోపీచంద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

### కేసు నమోదు

వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి బుధవారం ఉదయం కళాశాల హాస్టల్‌కు వెళ్లారు. అక్కడ దాడిలో గాయపడిన విద్యార్థులతో మాట్లాడారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. తమపై సీనియర్లు అజయ్‌కుమార్, గోపీకృష్ణ మరో నలుగురు కలిసి దాడి చేశారని సీహెచ్ పాల్ థామస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కాగా వివరణ కోరేందుకు కళాశాల హాస్టల్‌కు వచ్చిన మీడియా ప్రతినిధులపై ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.ఆర్.కె. రాజు, సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు దురుసుగా ప్రవర్తించారు.



విద్యార్థులను విచారిస్తున్న వన్‌టౌన్ సీఐ

# 'స్పేస్' తీసుకుందాం

- అంతరిక్ష విజయాల్లో భారత్ మరింత సత్తా చాటాలి
- విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి
- షార్ సైంటిస్ట్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ ఆకాంక్ష

గుంటూరు రూరల్: ప్రపంచ దేశాల్లో భారత్‌ను శక్తిమంతమైన దేశంగా నిలపడమే లక్ష్యంగా విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని షార్ శ్రీహరికోట, సైంటిస్ట్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో భారత ప్రభుత్వం, ఇస్రో, శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ – షార్ నేతృత్వంతో నిర్వహిస్తున్న తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో రాజరాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్పేస్ ఎగ్జిబిషన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రయాన్–3లాంటి సంక్లిష్టమైన ఓ ప్రయోగాన్ని భారత్ సుసాధ్యం చేసి చూపించిందన్నారు. ఇది భవిష్యత్తులో చేసే ప్రయోగాలకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. గగన్ యాన్, చంద్రయాన్–4 అంతరిక్ష ప్రయోగ విజయమే తమ ముందున్న లక్ష్యమని చెప్పారు. అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో ప్రపంచ దేశాల్లో భారత్ 4వ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. 2030 సంవత్సరానికి భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్మాణ దిశగా ఇస్రో అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో నూతన శాటిలైట్స్ తయారు చేసే స్థాయికి ఎదగాలని కోరారు. భవిష్యత్తులో విజయవంతంగా సురక్షితంగా చంద్రుడిపై కాలుమోపే దిశగా పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### వాడరేవు–పిడుగురాళ్ల హైవే

# బాపట్లకు మణిహారం

- భూములు కోల్పోయిన వారికి త్వరలో పరిహారం
- కలెక్టర్ జె.వెంకట మురళి



జాతీయ రహదారి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

చీరాల టౌన్: వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న 167–ఏ జాతీయ రహదారి త్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు తీసుకుంటున్నామని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఈ జాతీయ రహదారి వినియోగంలోకి వస్తే జిల్లా రూపురేఖలు మారి అభివృద్ధి పథంలో నడుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం వాడరేవు రోడ్డులో హాయ్ రెస్టారెంట్ సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనుల్ని పరిశీలించారు. హైవే నిర్మాణంతో పాటు మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. జాతీయ రహదారి పొడవు, దానిమీద నిర్మిస్తున్న బ్రిడ్జిలు, భూములు ఇచ్చిన వారి వివరాలు, పరిహారం గురించి పలు శాఖల అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. రహదారి పనులు ఆటంకం లేకుండా జరగాలని, వినియోగంలోకి వస్తే జిల్లాకే మణిహారం లాగా ఉంటుందని పేర్కొన్నారు. 2025 డిసెంబరు నాటికి రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. బాపట్ల జిల్లాలో ఈ రహదారి 35 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. వ్యవసాయంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలోని పంట ఉత్పత్తుల్ని ఎగుమతి చేయడానికి మార్గం సుగమం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తక్కువ సమయంలో చేరుకోవడంతో పాటుగా తీర ప్రాంతాలకు పర్యాటకులు అధికంగా వస్తారని తెలిపారు. నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి త్వరగా నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణ పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పి.సుబ్బారావు, చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

### వైఎస్సార్ సీపీ కార్యకర్తపై

# టీడీపీ గూండాల హత్యాయత్నం

- కన్నాపైనే పోస్టులు పెడతావా అంటూ దాడి
- నందిగామ అడ్డరోడ్డులో ఘటన
- గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మట్టుపల్లి ఏసుబాబు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్తపై హత్యాయత్నం జరిగిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన మట్టుపల్లి ఏసుబాబు (మోజెస్) వైఎస్సార్ సీపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారరు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సత్తెనపల్లి నుంచి నందిగామకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. నందిగామ అడ్డరోడ్డులో పెట్రోల్ బంక్ దాటిన తర్వాత ఆరుగురు టీడీపీ గూండాలు పథకం ప్రకారం ద్విచక్ర వాహనాలపై వచ్చి కర్రలతో దాడి చేశారు. కళ్లం విజయభాస్కర్ రెడ్డి అండ చూసుకొని కన్నా లక్ష్మీనారాయణపైనే ఎన్నికలకు ముందు పోస్టులు పెడతావా? ఇప్పుడు నిన్ను చంపితే ఎవడొస్తాడో రమ్మను.. చూద్దామంటూ.. కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా గాయపరిచారు. హుటాహుటిన స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రుడు ఏసుబాబును చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఏసుబాబు అక్కడే చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న క్షతగాత్రుడి తల్లి కమల, ఇతర కుటుంబ సభ్యులతో ఏరియా వైద్యశాలకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. తన బిడ్డను పొట్టన పెట్టుకునేందుకు అత్యంత కిరాతకంగా టీడీపీ గూండాలు దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రోదిస్తున్న క్షతగాత్రుడి తల్లి కమల

# నికర 'ఆదాయ' పామ్..!

- 8 మండలాల్లో కేంద్రం ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పైలెట్ ప్రాజెక్ట్
- పెట్టుబడితోపాటు ఎరువులు, మందుల ఖర్చులూ తక్కువే
- రైతులకు అందనున్న రూ.68 లక్షలకుపైగా రాయితీ

పెద్ద మొత్తంలో పెట్టుబడి భారం లేదు.. చీడపీడల నియంత్రణ, ఎరువులకు వ్యయం అంతగా లేదు.. ఒక్కసారి మొక్క నాటితే నాలుగేళ్లు మాత్రం వేచి చూడాలి. కానీ, 50 సంవత్సరాల వరకు రైతన్నకు నికర ఆదాయం తెచ్చిపెట్టే వనరు ఇది. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఆయిల్ పామ్ తోటల పెంపకం చేపట్టడం ఇక్కడి రైతులకు చక్కని అవకాశమని అధికారులు చెబుతున్నారు. భారీగా రాయితీలు పొంది, నికర ఆదాయం లభించే ఈ ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.


ఈపూరు మండలం గుండేపల్లి గ్రామంలో రైతు ఆయిల్ పామ్ మొక్క నాటుతుండగా పర్యవేక్షిస్తున్న అధికారి

**నరసరావుపేట:** దేశానికి విదేశీ మారకద్రవ్యం మిగిల్చే ఆయిల్ పామ్ తోటలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇతర రకాల పంటలు వేస్తూ చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలతో నానాటికీ కునారిల్లుతున్న రైతాంగానికి ఆర్థిక వెసులుబాటు కల్పించే తోటల పెంపకాన్ని ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్–ఆయిల్ పామ్ పథకం ద్వారా చర్యలకు శ్రీకారం చుట్టింది. పామాయిల్ వంటనూనెను ఉత్పత్తి చేసే ఆయిల్ పామ్ మొక్కలను సాగు చేసే రైతులకు 200 హెక్టార్లకుగాను రూ.68.64 లక్షల సబ్సిడీ ఇచ్చి మరీ ప్రోత్సహించనుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది పల్నాడు జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. మొత్తం ఎనిమిది మండలాల్లోని రైతులకు అధిక ఆదాయం కల్పించే ఆయిల్ పామ్ సాగును పరిచయం చేస్తున్నారు. అమరావతి, రాజుపాలెం, ఈపూరు, మాచవరం, బెల్లంకొండ, పిడుగురాళ్ల, నాదెండ్ల, సత్తెనపల్లి మండలాల్లోని 200 హెక్టార్లలో ఈ మొక్కలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 50 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు 20 మంది అన్నదాతలు సమాయత్తం అయ్యారు.

**ఎకరానికి ఎన్ని మొక్కలంటే..**

ఒక్కో ఎకరానికి సుమారుగా 57 మొక్కలు మాత్రమే పెంచాలి. సగటున హెక్టారుకు 150 వరకు పెంచుకోవచ్చు. ఎకరానికి రైతుకు రూ.12 వేల వరకు ఖర్చవుతుంది. మొక్కకు రూ.193 చొప్పున సబ్సిడీ లభిస్తుంది. దీంతో పాటు మొక్కల పెంపకానికి వాడే ఎరువులు, ఇతర పురుగు మందుల కోసం హెక్టారుకు రూ.5,250 సబ్సిడీ ఇవ్వనున్నారు. దేశవాళీ, విదేశీ మొక్కలు ఉండగా.. అధికారులు మాత్రం విదేశీ మొక్కలనే నాటాలని సూచిస్తున్నారు. ఈ మొక్కల్లో మగ, ఆడవి కూడా ఉంటాయి. ఆడ మొక్కలు మాత్రమే ఆయిల్ గింజల గెలలు కాస్తాయి. నీటి వసతి పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లోని రైతులు మాత్రమే ఈ తోటల పెంపకానికి ముందుకు రావాల్సి ఉంటుంది. మొక్క నాటిన నాటి నుంచి పెరుగుతున్న కొద్దీ రోజూ 250 నుంచి 300 లీటర్ల వరకు నీరు అవసరం. దీనికోసం తోట సమీపంలో నీటి కుంటలు, డ్రిప్ ఇరిగేషన్ శాఖ ద్వారా డ్రిప్ (తుంపర్ల) సౌకర్యం కల్పించుకోవాలి. దీనికి కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుంది. ముఖ్యంగా వేసవిలో ఏప్రిల్, మే నెలల్లో మొక్కలకు నీరు తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుంది. ఆ మేరకు నీటి వసతి కల్పిస్తేనే తగిన దిగుబడిని రైతులు సాధించగలుగుతారు. పది అంతకంటే ఎక్కువ ఎకరాల్లో తోట వేస్తేనే రైతుకు ఏడాదికి రూ.లక్షలలో ఆదాయం లభిస్తుంది.

**దిగుబడి మొదలైతే ఆగదు..**

మొక్కలు నాటిన నాలుగేళ్ల తర్వాత చెట్లుగా ఎదిగి.. ఆయిల్ పామ్ గింజల గెలలు వేస్తాయి. ఈ చెట్లకు చీడపీడలు చాలా తక్కువ. ఒకసారి మొక్క నాటిన తర్వాత నాలుగేళ్ల నుంచి దిగుబడి మొదలవుతుంది. 50 ఏళ్ల వరకు వస్తూనే ఉంటుంది. ఎంపిక చేసిన మండలాల్లోని అమరావతి, రాజుపాలెం, ఈపూరు, మాచవరం, బెల్లంకొండ, పిడుగురాళ్లలో రైతులు పండించిన ఆయిల్ పామ్ గింజల గెలలను మెసర్స్ వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కొనుగోలు చేయనుంది. చివరి రెండు మండలాలైన నాదెండ్ల, సత్తెనపల్లి రైతుల నుంచి మెస్సర్స్ గోద్రేజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా మండలాల సమీపంలో ఈ సంస్థలు సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. ఈ ఏడాది మార్కెట్ ప్రకారం టన్నుకు రూ.14,500 ధర పలికింది. రూ.20 వేల వరకు పలికిన సందర్భాలు కూడా గతంలో ఉన్నాయి.

### తక్కువ పెట్టుబడితో అధిక లబ్ధి



ఈ ఆయిల్ పామ్ తోటలకు పెట్టుబడి తక్కువ. అంతేకాకుండా ఏళ్ల తరబడి నికర ఆదాయం కూడా రైతులకు లభిస్తుంది. ఒకసారి మొక్క నాటి తగిన విధంగా సంరక్షిస్తే 40 నుంచి 50 ఏళ్లపాటు ఆదాయం లభిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. బాగా నీటి వసతి ఉన్న రైతులే ఈ తోటల పెంపకానికి ముందుకు వస్తే మంచిది. డ్రిప్, నీటి కుంటల సౌకర్యం కూడా ఏర్పాటు చేసుకోవాలి. ఈ తోటలకు నీరే అత్యంత ముఖ్యం. అందుకే పల్నాడులో ఇప్పటివరకు రైతులు సాగు చేయలేదు. జిల్లాలో నీటి వసతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలనే ఇప్పుడు పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. ప్రతి ఏడాది రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యంతో మలేషియా, ఇండోనేషియా దేశాల నుంచి పామాయిల్ వంటనూనెను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అదే పామాయిల్ దేశంలోనే ఉత్పత్తి చేస్తే అమూల్యమైన విదేశీ మారకద్రవ్యం మిగులుతుంది. తద్వారా దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది.

– సీహెచ్ వెంకట రమణారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

## క్లుప్తంగా

### కల్యాణ వేంకటేశ్వరస్వామి గుడిలో చోరీ



**యడ్లపాడు:** మండల కేంద్రమైన యడ్లపాడులో చోరీ జరిగి 24 గంటలు గడవక ముందే బోయపాలెంలో మరో దొంగతనం వెలుగు చూసింది. బోయపాలెం గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి గుడిలోని గంటలతోపాటు పూజా వస్తువుల్ని దుండగులు ఎత్తుకెళ్లారు. బోయపాలెం పరిధిలోని 16వ జాతీయ రహదారి సర్వీసు మార్గం పక్కనే చెరువు ఒడ్డున గుడి ఉంది. 7 కేజీలు, అర కేజీ బరువు కలిగిన ఇత్తడి గంటలు, హారతి పళ్లెం చోరీ అయ్యాయి. నిత్యం పలు వాహనాలు, జనరద్దీ ఉండే ఈ ప్రాంతంలో చోరీ జరగడంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆలయ ధర్మకర్త వడ్డేపల్లి నరసింహారావు తెలిపారు. గతంలోనూ ఇదే గుడిలోని 8 కేజీల ఇత్తడి గంట చోరీ అయిన విషయాన్ని గుర్తు చేశారు. బుధవారం మధ్యాహ్నం గుడి వద్దకు వెళ్లిన సమయంలో గమనించగా గేటు తాళాలు పగులగొట్టి ఉన్నాయని తెలిపారు. లోపలికి వెళ్లి చూడగా సుమారు రూ.10 వేల విలువైన వస్తువులు మాయం అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

### రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



**నరసరావుపేట టౌన్:** గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎస్పీ బంగ్లా సమీపంలో మంగళవారం రాత్రి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే ఎస్‌ఐ టి. సుబ్బారావు బుధవారం సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.





# సొంత జిల్లాలకు 'ఎన్నికల' తహసీల్దార్లు

ఇన్‌చార్జులను నియమించిన ప్రభుత్వం

**నరసరావుపేట:** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పొరుగు జిల్లాల నుంచి పల్నాడుకు బదిలీ అయిన తహసీల్దార్లను మళ్లీ సొంత జిల్లాలకు పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారి స్థానంలో ఇన్‌చార్జులను నియమించింది. వివరాలు... ఎన్నికల సమయంలో కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్, కో ఆర్డినేషన్ సెక్షన్లకు సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన తహసీల్దార్ టి.రవిని సొంత ఉమ్మడి ప్రకాశం జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో కో ఆర్డినేషన్ సెక్షన్ డీటీ కె.రామకోటేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ డీటీ ఎ.మాధవికి బాధ్యతలు అప్పగించారు. నరసరావుపేట ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పనిచేసిన కేఎస్‌ఆర్ కృష్ణారావును సొంత జిల్లా ప్రకాశంకు బదిలీ చేశారు. డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌వీ నాగేశ్వరరావుకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

- కారెంపూడి మండల తహసీల్దార్ బి.జయవర్ధన్‌ను సొంత ప్రకాశం జిల్లాకు బదిలీ చేసి రీసర్వే విభాగంలో డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎంకేఎస్ స్రవంతికి బాధ్యతలు ఇచ్చారు.
- రొంపిచర్ల మండలం తహసీల్దార్ ఎస్.ఉషారాణిని ప్రకాశం జిల్లాకు బదిలీ చేసి డెప్యూటీ తహసీల్దార్ జి.అంకారావును ఇన్‌చార్జిగా నియమించారు. ముప్పాళ్ల మండల తహసీల్దార్ పి.సింగారావును ప్రకాశం జిల్లాకు బదిలీ చేసి డెప్యూటీ తహసీల్దార్ సి.లక్ష్మిప్రసాదును, బొల్లాపల్లి మండల తహసీల్దార్ బీవీ రామారావును ప్రకాశం జిల్లాకు బదిలీ చేసి సీఎస్‌డీటీ విద్యాసాగర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. నూజెండ్ల, దుర్గి, సత్తెనపల్లి, క్రోసూరు, నకరికల్లు, చిలకలూరిపేట, నరసరావుపేట మండలాల తహసీల్దార్లు మహమద్ నయీం, జి.రజనీ కుమారి, సీహెచ్.ఉష, ఎం.సువర్ణ, ఎల్.లక్ష్మీనారాయణ, ఎం.జ్వాలా నరసింహం, ఎం.హరిబాబులను ప్రకాశం జిల్లాకు బదిలీ చేసి డెప్యూటీ తహసీల్దార్లు ఎం.అర్జున్‌నాయక్, ఐ.ఫణీంద్రకుమార్, యు.రాజేంద్రప్రసాదు, కె.శ్రీనివాసరావు, కె.అరుణాదేవి, ఎస్.రవికుమార్, జి.శ్రీనివాస్‌లకు బాధ్యతలు అప్పగించారు. అలాగే అచ్చంపేట, గురజాల, మాచర్ల, ఈపూరు మండల తహసీల్దార్లు కె.ప్రవీణ్‌కుమార్, సీహెచ్ అశోక్‌రెడ్డి, డి.మంజునాథరెడ్డి, బి.దిలీప్‌కుమార్‌లను ప్రకాశం జిల్లాకు బదిలీ చేసి డెప్యూటీ తహసీల్దార్లు షేక్ జానిబాషా, జీవీ రమణ, డి.శ్రీనివాసరావు, ఆర్.వెంకటేశ్వరావులకు బాధ్యతలు అప్పగించారు. పెదకూరపాడు, వినుకొండ తహసీల్దార్లు జె.ప్రభాకరరావు, పి.బ్రహ్మయ్యలను వారి సొంత జిల్లా బాపట్లకు బదిలీ చేశారు. డెప్యూటీ తహసీల్దార్లు బి.నిర్మలకృష్ణ, కె.బాలవెంకటేష్‌లకు బాధ్యతలు అప్పగించారు. సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా వ్యవహరించిన షేక్ మహమద్ హుస్సేన్‌ను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు ఉమ్మడి జిల్లాకు బదిలీ చేసి డెప్యూటీ తహసీల్దార్ ఎ.నళినికి బాధ్యతలు ఇచ్చారు. వెల్దుర్తి, మాచవరం, అమరావతి, రాజుపాలెం, బెల్లంకొండ, పిడుగురాళ్ల మండల తహసీల్దార్లు కె.చంద్రశేఖర్, డి.శ్రీరామకృష్ణ, ఎ.వెంకటరమణారావు, పి.లక్ష్మినరసింహం, ఐఎస్ ప్రసాదు, పి.గీతావళి, ఎం.శ్యాంసుందరరాజాలను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు ఉమ్మడి జిల్లాకు బదిలీ చేసి డెప్యూటీ తహసీల్దార్లు కె.రాజశేఖర్, డి.మేరీకనకం, పి.సునీత, ఎస్.సరోజ, బి.నిర్మల, ఎం.రాజ, ఎస్.ధనలక్ష్మీలకు బాధ్యతలిచ్చారు.

# ఏఎన్‌యూ దూరవిద్య సేవల విస్తృతికి కృషి

- సైన్స్ కోర్సులు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు
- అందరి సహకారంతో మరింత అభివృద్ధికి ప్రయత్నాలు
- కొత్త డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు


బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

**ఏఎన్‌యూ(గుంటూరు):** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం సేవలు, కోర్సులు మరింత విస్తృతం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని నూతన డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు చెప్పారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని, మరింత అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు చేపడతానన్నారు. కొన్నేళ్లుగా ఏఎన్‌యూ దూర విద్యకేంద్రంలో సైన్స్ కోర్సులు నిలిచిపోయాయని త్వరలో సైన్స్ కోర్సులు అన్ని అనుమతులతో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ఆర్థిక ఇబ్బందులు, సమయాభావం వల్ల రెగ్యులర్‌గా చదువుకోలేని వారికి, ఉద్యోగాలు చేస్తూ పదోన్నతుల కోసం ఆయా కోర్సులు చదివే వారందరి ప్రయోజనాలు పరిరక్షిస్తూ అన్ని సంస్కరణలు ప్రవేశపెడతామన్నారు. దూరవిద్య కేంద్రం అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో విద్యార్థులకు అత్యుత్తమ సేవలు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్నత విద్యలో రెగ్యులర్ కోర్సులకు దీటుగా దూరవిద్య కోర్సులను విద్యార్థులకు అందిస్తామన్నారు. దూరవిద్యాకేంద్రం మాజీ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, మాజీ పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధకులు నూతన డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

**బాధ్యతలు స్వీకరించిన పరీక్షల కో–ఆర్డినేటర్**

దూరవిద్య కేంద్రం పరీక్షల కో–ఆర్డినేటర్‌గా ఆచార్య డి.రామచంద్రన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ రీసెర్చ్‌సెల్ కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ పి.సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు.

# 108 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**గుంటూరు మెడికల్:** అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 108 అంబులెన్సుల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా (ఈఎంటీ) పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. బీఎస్సీ బయాలజీ, బి.జడ్‌సీ, బీఎస్సీ నర్సింగ్, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బీఫార్మసీ చదివి 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. మంగళగిరి, తుళ్లూరు, కాకుమాను, వట్టిచెరుకూరు, కొల్లిపర, తాడేపల్లి, తెనాలి, తాడికొండ లలో ఉద్యోగాలకు ఎంపికైన వారు పనిచేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాను గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం రెండో ఫ్లోర్‌లోని 108 ఆఫీసులో అందజేయాలన్నారు. వివరాలకు 91218 92889 నంబరులో సంప్రదించాలన్నారు.

# రోడ్ల అనుసంధానానికి రూ.30 కోట్లు ఇవ్వండి

- ఉప ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు
- నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కూడా వినతి


ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేసి, వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట:** నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన కోటప్పకొండ క్షేత్ర ఘాట్ రోడ్డు, కొండ చుట్టూ రహదారుల అనుసంధానానికి అవసరమైన రూ.30 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కె.పవన్‌కళ్యాణ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. కోటప్పకొండ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన నిధులు మంజూరు చేస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల గురించి కూడా ఆయనకు వివరించామన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపు వంటి అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు రాష్ట్రాభివృద్ధికి అత్యంత కీలకమని గుర్తుచేశామన్నారు. అలాంటి ప్రాంతాల ప్రగతికి ఎప్పుడూ అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు శాఖమూరి రామ్మూర్తి పాల్గొన్నారు.

# చెస్‌లో రాణిస్తున్న రెంటచింతల చిచ్చరపిడుగు


నిర్వాహకుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పర్వతరెడ్డి అజయ్ సంతోష్

**రెంటచింతల:** చదరంగం పోటీలలో మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన చిన్నోడు పర్వతరెడ్డి అజయ్ సంతోష్ అంతర్జాతీయ ప్రమాణాన్ని (ఐఎం నార్మ్స్) సాధించి ఉమ్మడి గుంటూరు జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటాడు. ఉడుముల సాంబశివారెడ్డి (ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి) మనుమడు అజయ్ సంతోష్ చిన్నప్పటి నుంచి చదరంగంలో నైపుణ్యం ప్రదర్శించేవాడు. తన కన్నా పెద్దవారితో కూడా ఆడుతూ చక్కని ఎత్తులు వేస్తూ అబ్బురపరిచేవాడు. అతడిలో దాగిన ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు వెంకట మయూర్ బాబు, సంధ్యారాణిలు.. చెస్ మాస్టర్ వద్ద ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు స్లోవేకియా దేశంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ చెస్ పోటీలలో అజయ్ సంతోష్ 2400 ఫిడే ఎలో రేటింగ్ పాయింట్లతో ఐఎం నార్మ్స్ సాధించాడు. ఈ పోటీలలో వివిధ విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు నగదు బహుమతులను నిర్వాహకులు చీఫ్ ఆర్బిటర్ ఐఏ దివియక్, రస్టిస్లావ్ చేతులమీదుగా అందుకున్నాడు. ఈ ఏడాది జూన్‌లో కజకిస్థాన్‌లోని అల్మటీ నగరంలో జరిగిన ఆసియా యూత్ చాంపియన్ షిప్ అండర్–18 విభాగంలో దేశానికి ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ కనబరిచాడు. దీంతో భారత జట్టు ఓపెన్, ర్యాపిడ్ విభాగాలలో రజత పతకాన్ని సాధించింది. అజయ్ సంతోష్ చదరంగంలో అత్యున్నత స్థాయికి చేరుకుని దేశం గర్వించదగిన క్రీడాకారుడిగా ఖ్యాతి పొందాలని గ్రామ పెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# ఉద్యాన రైతులకు మూడు పథకాల్లో రాయితీలు


నర్సరీలో నారును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణారెడ్డి

**నరసరావుపేట:** జిల్లాలో ఉద్యాన పంటల ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి ఈ ఏడాది మూడు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా ఉద్యాన శాఖాధికారి సీహెచ్.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఆయన వీటి వివరాలు వెల్లడించారు. 2024–25 ఏడాదికి ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), ఆయిల్ పామ్ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో ఎంఐడీహెచ్ ద్వారా రూ.5.41 కోట్లను పండ్లు, పూల తోటల రైతులకు సబ్సిడీ ద్వారా అందజేయనుందన్నారు. మామిడి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, జామ తోటల పునరుద్ధరణ, హైబ్రిడు కూరగాయలు, బంతి, చామంతి, మల్లె, కనకాంబరం వంటి పూలతోటలు పెంపకానికి ఈ సబ్సిడీ అందించనున్నట్లు చెప్పారు. దీనిలో నీటిని నిల్వ చేసుకునేందుకు కుంటల నిర్మాణం, రక్షిత వ్యవసాయం ద్వారా షెడ్‌ల ఏర్పాటుతో నాణ్యమైన మిరప నారు పెంచేందుకు అవకాశం ఇవ్వనున్నారని తెలిపారు. వీటితోపాటు అధిక విలువైన కూరగాయలు, పూల మొక్కల పెంపకం, ప్యాక్ హౌస్, కలెక్షన్ సెంటర్ నిర్మించేందుకు సహకారం అందిస్తామన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కోసం శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. చిన్న ట్రాక్టర్లు, పవర్ ట్రిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లు కూడా సబ్సిడీ కింద మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ఆర్‌కేవీవై ద్వారా రూ.61.30 లక్షల సబ్సిడీని రైతులకు ఇస్తారని తెలిపారు. హైబ్రిడ్ కూరగాయల సాగు, విత్తన పంపిణీ, శాశ్వత పందిరి నిర్మాణం, కలెక్షన్ సెంటర్, సోలార్ కోల్డ్‌రూమ్ నిర్మించేందుకు ఈ సబ్సిడీ కేటాయించామని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగును నూతనంగా జిల్లాలో ఎనిమిది మండలాల్లో విస్తరించేందుకు రూ.68.64 లక్షల సబ్సిడీ అందజేతకు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కేంద్ర ప్రోత్సాహాన్ని వినియోగించుకోండి**

**నరసరావుపేట రూరల్:** పీఎంఎఫ్ఎంఈ (ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్) పథకంలో 35 శాతం రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్‌కి సంబంధించిన మిషనరీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి తెలిపారు. మండలంలోని గురవాయపాలెంలోని రైతు శాఖమూరి రాంబాబు షేడ్ నెట్స్‌లో ఏర్పాటు చేసిన సోలార్ డ్రయర్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. సోలార్ డ్రయర్‌ను వినియోగించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. దీని ద్వారా వేరుశనగ, ఆముదం, ఇతర విత్తనాలు డ్రై చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. పీఎంఎఫ్ఎంఈలో అనేక రకాల ప్రాసెసింగ్ మిషనరీలు 35 శాతం రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ రాయితీని వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలోని మిరప నారు పెంచే నర్సరీలను సందర్శించి జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్, ఉద్యాన సహాయకులు ఆంజనేయులు, వ్యవసాయ సహాయకుడు షాహీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనీయుడు విశ్వకవి జాషువా

ఏఎన్‌యూలో జాషువా వర్ధంతి


గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీజే రత్నాకర్, త్రిమూర్తిరావు తదితరులు

**ఏఎన్‌యూ(గుంటూరు):** ఎదుర్కొన్న అవమానాలనే ఆయుధంగా మలచుకుని విశ్వకవిగా ఎదిగిన ఆదర్శనీయుడు గుర్రం జాషువా అని యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలో గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేంద్రం డైరెక్టర్ ఆచార్య రత్నాకర్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు హాజరై జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రత్నాకర్ మాట్లాడుతూ మన సమాజంలోని అసమానతలు, వివక్షలు, రుగ్మతలపై సమాజానికి అన్ని వర్గాలకు అవగాహన కల్పించి వాటి నిర్మూలనకు సామాన్యులను సైతం సన్నద్ధం చేసేందుకు జాషువా కవిత్వం ఎంతో దోహదం చేసిందన్నారు. బాధలు, అవమాలకు కుంగిపోకుండా కవిత్వం ద్వారా పోరాడిన విశ్వనరుడు జాషువా అని కొనియాడారు. 'గబ్బిలం' రచనను విద్యార్థులు, పరిశోధకులందరూ చదవాలని సూచించారు. పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడుతూ జాషువా కేవలం రచయిత మాత్రమే కాదని గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. జాషువా రచనలపై యూనివర్సిటీలో మరింత పరిశోధనలు జరగాలన్నారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ ఇజ్రాయేల్, డాక్టర్ ఎస్ రాజశేఖర్, పరిశోధక సంఘ నాయకులు వై.రాజేష్, ఎస్.శాస్త్రి, సీహెచ్ సునీల్, చంద్రబాబు, ఎస్ ఎజ్రా, పలువురు ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# బియ్యం లారీ స్వాధీనం


చిల్లకల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

**చిల్లకల్లు(జగ్గయ్యపేట):** అనుమానాస్పదంగా ఉన్న బియ్యం లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం తెల్లవారుజామున చిల్లకల్లులో జరిగింది. కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఓ లారీ మంగళగిరి నుంచి ముంబైకి వస్తుండగా చిల్లకల్లు వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అనుమానం రావటంతో లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో దాదాపు 20 టన్నుల బియ్యం గుర్తించి తహసీల్దార్ శేషగిరికి సమాచారం అందించారు. రెవెన్యూ అధికారులు బియ్యం పరిశీలించారు. అది రేషన్ బియ్యమా కాదా అని తెలుసుకునేందుకు పౌరసరఫరాల శాఖ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సరుకు మంగళగిరికి చెందిన వడ్లమూడి శంకర్ రైస్ మిల్లుకు చెందిన యజమాని మహ్మద్ ఖాశీంకు చెందినదని లారీతో పాటు వచ్చిన భాస్కర్ అధికారులకు తెలిపారు. అధికార పార్టీ నాయకులకు చెందినదని ప్రభుత్వం పెద్దల నుంచి ఫోన్ వస్తుందని భాస్కర్ అధికారులను బెదిరించినట్లు సమాచారం.